క్లుప్తంగా

అపూర్వ కలయిక



జగ్గయ్యపేట: ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు గురువారం రాత్రి పట్టణానికి వచ్చిన సందర్భంగా నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దూలంకు పార్టీ నాయకులతో కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వట్టెం మనోహర్, యువజన ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మండవ శ్రీనివాసగౌడ్, కరిసె ఇజ్రాయిల్, సతీష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పోసాని అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం

జగ్గయ్యపేట: ప్రముఖ సినీ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళిని ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు మోపుతూ ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. తొమ్మిది నెలల కాలంలో అక్రమ అరెస్టలతో కూటమి ప్రభుత్వం కాలం వెళ్లదీయడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



జగ్గయ్యపేట: పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం జరిపించారు. లోక కల్యాణార్థం ప్రతి ఏటా శివరాత్రి పర్వదినాన స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణం పీటలపై స్వర్ణకార సంఘాల ప్రతినిధుల దంపతులు కూర్చుని కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొల్లికుళ్ల(పెనుగంచిప్రోలు): శివరాత్రి పర్వదినానికి శ్రీశైలం వెళ్లి ప్రమాదవశాత్తూ కృష్ణానదిలో పడి మరణించిన వారి కుటుంబాలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి తన్నీరు నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన పెరుగు చిన్నగురవయ్య, వాసు తండ్రీకొడుకులు. వారు శివరాత్రికి శ్రీశైలం వెళ్లి పుణ్యస్నానాల కోసం నదిలో దిగారు. ప్రమాదవశాత్తూ ఇద్దరూ నదిలో మునిగి మరణించారు. తన్నీరు వెంట రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బత్తుల రామారావు, సర్పంచ్ జొన్నలగడ్డ కిషోర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు కోనంగి ముక్కంటి ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ మురుగు కాలువలు, రోడ్ల వెంబడి బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామనని అన్నారు. తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే ఆస్పత్రి నిర్మాణం

నందిగామ టౌన్(నందిగామ రూరల్): ఎన్నికల కోడ్ ముగియగానే టెండర్‌లను పిలిచి వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల నేతలు కోర్టులను ఆశ్రయించి తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. నందిగామకు వంద పడకల ఆస్పత్రిని తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌పై వ్యాఖ్యలు అర్థరహితం

జగ్గయ్యపేట: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై శ్రీకాకుళం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలో ఆయన స్వగృహంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ శాసనసభలో ఇటీవల దువ్వాడ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

గాడిద పాలు.. గరిటడైన చాలు.!

- లీటరు పాల ధర రూ. ఆరు వేలు పైమాటే
- ఖనిజాలు, విటమిన్లతోపాటు మెండుగా పోషకాలు
- ఆసక్తి చూపుతున్న ప్రజలు



గాడిదలతో వచ్చి నందిగామలో ఉంటున్న గాడిద పోషకులు



గాడిద పాలను పితుకుతున్న మహిళ



గాడిద పాలతోపాటు ఆయుర్వేద మందులు

నందిగామ రూరల్: మనం నిత్యం ఎంతో చులకనగా చూస్తూ.. అవమానానికి మారుపేరుగా నిలిచిన గాడిద పాలలో మానవ శరీరానికి మేలు చేసే ఎన్నో ఔషధ గుణాలున్నాయి. గాడిద పాలలో ఖనిజాలు, విటమిన్లతో పాటు పోషకాలు మెండుగా ఉండటంతో మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో లీటరు గాడిద పాలు రూ. ఆరు వేల పైనే పలుకుతోంది. నడుము, కీళ్ల నొప్పులు, కడుపు నొప్పి, కాళ్లు, చేతుల తిమ్మిర్లు, దగ్గు, జలుబు, గ్యాస్, షుగర్, ఉబ్బసం తదితర రోగాలను నయం చేయడంలో గాడిద పాలు దోహదపడతాయని పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు. పాశ్చాత్య దేశాల్లో నవజాత శిశువు నుంచి వయసు మళ్లిన వారు సైతం గాడిద పాలను బలవర్ధక ఆహారంగా తీసుకుంటుండటం విశేషం. పాలలో యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు ఉండటంతో అంటువ్యాధులు, బ్యాక్టీరియా, ఇతర వైరస్‌ల నివారణకు వినియోగిస్తున్నారు.

ఊరూరు తిరుగుతూ గాడిద పాల విక్రయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల, మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన పలువురు బృందాలుగా ఏర్పడి గాడిద పాలను విక్రయించి జీవనం సాగిస్తున్నారు. గాడిదలను ఆటోల్లో ఎక్కించి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ వారి కళ్లెదుటే పాలు పితికి 50 ఎంఎల్ పాలు రూ. 300, 25 ఎంఎల్ పాలు రూ. 200ల చొప్పున విక్రయిస్తున్నారు. పాలతో పాటు అటవీ ప్రాంతాల్లో లభించే ఆయుర్వేద మూలికలు, కందు చెక్క తదితర చెట్ల బెరడులతో తయారు చేసిన మందును కలిపి విక్రయిస్తున్నారు. గాడిద పాలతో కలిపి మందులు తీసుకోవడం వల్ల మంచే జరుగుతుంది తప్ప ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని చెబుతున్నారు. పూర్వీకుల నుంచి గాడిద పాలను విక్రయించే జీవనం సాగిస్తున్నామని.. కరోనా సమయంలో గాడిద పాలను విరివిగా వినియోగించారని.. అప్పటి నుంచి పాల వినియోగం పెరిగిందంటున్నారు.

దుష్ప్రభావాలు ఉండవు



మా పూర్వీకుల నుంచి గాడిద పాలను విక్రయించే జీవనం సాగిస్తున్నాం. కరోనా సమయం నుంచి పాల వినియోగం పెరిగింది. ఆయుర్వేద మందులతో కలిపి 50 ఎంఎల్ పాలను రూ. 300లకు, 25 ఎంఎల్ పాలను రూ. 200ల చొప్పున విక్రయిస్తున్నాం. ఆయుర్వేద మందులతో కూడా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు.

వెంకట్, మంచిర్యాల

జీవనాధారం



గాడిదలను ఆటోల్లో ఎక్కించి ఊరూరు తిరుగుతూ గాడిద పాలు విక్రయించి పొట్ట పోసుకుంటున్నాం. ఆటో కిరాయి, గాడిదల పోషణ తదితర ఖర్చులు పోనూ మిగిలిన సొమ్ముతో మా జీవనం సాగుతోంది. చిన్న గుడారంలోనే పిల్లలతో కలిసి ఉంటున్నాం. నొప్పులు తదితర రుగ్మతలు తగ్గుతాయని నిపుణులు చెబుతుండటంతో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

లక్ష్మి, మంచిర్యాల

ఒకటి, రెండుసార్లు తాగవచ్చు



గాడిద పాలలో మానవ శరీరానికి అవసరమైన ప్రయోజనాలు ఉన్నాయి. శిశువులైనా, పెద్దలైనా ఒకటి, రెండు సార్లు తాగవచ్చు. నవజాత శిశువుల్లో రోగనిరోధక శక్తిని పెంచేందుకు, ఆయాసం, ఉబ్బసం, నొప్పులు తదితరాలను నయం చేసేందుకు గాడిద పాలు దోహదపడతాయి.

స్రవంతి, భూచవరం వైద్యాధికారి, జగ్గయ్యపేట మండలం

వైద్య కళాశాల నందిగామ ప్రజల చిరకాల స్వప్నం

ఎమ్మెల్సీ అరుణకుమార్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్(నందిగామ రూరల్): వైద్య కళాశాల నందిగామ ప్రజల చిరకాల స్వప్నమని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై అరుణకుమార్ స్పందించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ వంద పడకల ఆస్పత్రి ఎవరి హయాంలో వచ్చిందో.. ఎవరి హయాంలో శంకుస్థాపన చేశారో నందిగామ ప్రజలకు తెలుసని, ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన వంద పడకల ఆస్పత్రిని తాము తీసుకువచ్చామని కూటమి నేతలు, మంత్రి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా స్థల సేకరణ

దినదినాభివృద్ధి చెందుతున్న నందిగామ ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి జాతీయ రహదారికి సమీపంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదెకరాల భూమిని సేకరించడం జరిగిందని అరుణకుమార్ తెలిపారు. స్థలాన్ని ఇచ్చిన దాతలకు రూ. 2.50 కోట్లను కూడా ప్రభుత్వం కేటాయించిందన్నారు. మంచి మనసుతో తక్కువ ధరకు ఆస్పత్రి నిర్మాణానికి రైతులు భూములు అప్పగించారని గుర్తుచేశారు. మా ప్రభుత్వ హయాంలో సేకరించిన స్థలంలో నిర్మించడం ఇష్టం లేకపోతే మరొక స్థలం కొనుగోలు చేసి విశాలమైన ప్రాంగణంలో ఆస్పత్రి నిర్మించాలని సూచించారు. పంతానికి పోయి ఇప్పుడున్న 2.40 ఎకరాల్లో వంద పడకల ఆస్పత్రిని నిర్మించి నందిగామ ప్రజల భవిష్యత్‌ను కాలరాయొద్దని హితవు పలికారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని కూడా కూటమి ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారని అరుణకుమార్ దుయ్యబట్టారు. ఇప్పుడు వంద పడకల ఆస్పత్రి కూటమి నేతలు తీసుకువచ్చారని చెబుతున్నారని రానురాను కేంద్రీయ విద్యాలయం, రహదారుల అభివృద్ధి, విస్తరణ, డివైడర్లు, ఆర్డీవో కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రైతు బజార్ అభివృద్ధి, మున్సిపాలిటి అప్‌గ్రెడేషన్ తదితర అభివృద్ధి పనులను కూడా వారే చేశారని అంటారేమోనని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఓర్సు జ్వాలా, ఉలవలపూడి నరేంద్ర, మంగళపూడి కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

వత్సవాయి: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రం వత్సవాయిలోని జెడ్పీ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 1,482 ఓట్లు ఉండగా వాటిలో 1,013 ఓట్లు పోలయ్యాయి. 27వ బూత్‌లో 550 ఉండగా 359 ఓట్లు, 28వ బూత్‌లో 932 ఉండగా 654 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 70 శాతం ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారులు చిత్రాల వెంకటేశ్వరరావు, అశోక్‌కుమార్‌లు తెలిపారు. ఎస్ఐ పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నందిగామ నియోజకవర్గంలో..

కంచికచర్ల /నందిగామ టౌన్(నందిగామ రూరల్): నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 12 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 9,074మంది ఓటర్లు ఉండగా సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిన పోలింగ్‌లో 68.06 శాతం ఓట్లు నమోదు అయ్యాయని నందిగామ ఆర్డీఓ కే బాలకృష్ణ తెలిపారు. కంచికచర్ల మండలంలో 73.79శాతం, నందిగామ మండలంలో 67.07శాతం, వీరులపాడు మండలంలో 61.7 శాతం అదేవిధంగా చందర్లపాడు మండలంలో 73.07శాతం నమోదు అయిందని ఆర్డీఓ తెలిపారు. కాగా కంచికచర్లలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, శశికళ దంపతులు పట్టణంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 34వ పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, డాక్టర్ పీ రమాదేవి దంపతులు 35వ బూత్‌లో ఓటు వేశారు. అలాగే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూడా 35వ బూత్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 4,350 మంది ఓటర్లుండగా 3,061 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 21వ బూత్‌లో అత్యధికంగా 70.73 శాతం నమోదైంది. 21వ బూత్‌లో మాజీ మంత్రి నెట్టెం రఘురాం దంపతులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు దంపతులు, 22వ బూత్‌లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెనుగంచిప్రోలులో..

గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 71.37 శాతం ఓటింగ్ నమోదైంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, సర్పంచ్ పద్మావతిలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వీరులపాడు: వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 62.43 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలోని 1,627 మందికి గాను 1005 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ అనిల్ బందోబస్తు నిర్వహించారు.



కంచికచర్ల జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నికలను పరిశీలిస్తున్న నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ



వత్సవాయిలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న పట్టభద్రులు



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



జగ్గయ్యపేటలో 25వ బూత్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్

పేటలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ పరిశీలించి పోలింగ్ సరళి, ఎన్నికల విధుల నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లను కూడా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టర్‌తో నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, ఎంపీడీవో నితిన్, ఎన్నికల డీటీ రాధిక ఉన్నారు.

నందిగామ టౌన్(నందిగామ రూరల్): పట్టణంలోని పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ఎన్నికల సరళిని కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. క్యూలైన్‌లలో ఉన్న వారిని జాప్యం లేకుండా ఓటింగ్‌ను వేగవంతం చేయాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఏజెంట్స్ సమక్షంలో నిబంధనల మేరకు క్లోజ్ చేసి గుంటూరులోని లెక్కింపు కేంద్రానికి పోలీసు ఎస్కార్ట్‌తో తరలించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆయన వెంట ఆర్డీవో బాలకృష్ణ, ఏసీపీ తిలక్, తహసీల్దార్ సురేష్‌బాబు ఉన్నారు.

వైభవంగా ఆదిదంపతుల కల్యాణం

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం



ముక్త్యాలలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ముక్త్యాలలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలులో చిన్నారుల నాట్య ప్రదర్శన

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను అర్చకులు మేళతాళాలతో తీసుకువచ్చారు. అనంతరం యాగ్నీక అర్చకుడు జొన్నాబొట్ల కిషోర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు వారణాసి సాంబశివరావు, తూమాటి లక్ష్మీనరసింహాచార్యులు, మద్దిరాల ప్రేమ్‌కుమార్ శర్మలు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు విచ్చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తరపున కేసీపీ సిమెంట్స్ జాయింట్ డైరెక్టర్ కవితా దత్ దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవం సందర్భంగా వల్లభి నాదస్వర బృందంచే మంగళ వాయిద్యాలు, జానపద భక్తి గీతాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కానూరి సురేష్‌బాబు, సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారికి లింగోద్భవ అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అమృతలింగేశ్వరుని కల్యాణం

గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహర మహా క్షేత్రంలో వేంచేసియున్న కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్ధరాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధికారి ప్రసాద్, గ్రామస్తులు వర్మ, వెంకట నర్సయ్య, భక్తులు పాల్గొన్నారు.

వత్సవాయి: శివరాత్రి పర్వదినాన బుధవారం రాత్రి వత్సవాయి శివాలయం, లింగాల, మక్కపేట రామలింగేశ్వర స్వామివార్లు, భీమవరం కాశీవిశ్వేశ్వర, కోనగిరి మల్లికార్జునస్వామి, కన్నెవీడు, మంగొల్లు, పోలంపల్లి, కంభంపాడు గ్రామాల్లోని శివాలయాల్లో శివ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివార్లకు గ్రామోత్సవం జరిగింది. అర్చకులు కేవైఎస్ శర్మ, యుగంధర్ శర్మ, సంగయ్య శర్మ, అంబయ్య శర్మ, రాఘవ శర్మ, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. కల్యాణాన్ని పురస్కరించుకుని చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వాసిరెడ్డి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ అమ్మవారికి జలబిందెలు

నందిగామ టౌన్(నందిగామ రూరల్): పట్టణంలో వేంచేసియున్న అంకమ్మ తల్లి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో భద్రకాళి సహిత వీరభద్రస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా గురువారం జలబిందెల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం నుంచి అంకమ్మ అమ్మవారి ఆలయం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా జల బిందెలను తీసుకువచ్చారు. అనంతరం భారీ అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో 108 కేజీల తేనె, 18 రకాల సుగంధ ద్రవ్యాలతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధానార్చకుడు దండిబొట్ల బాలకృష్ణ శాస్త్రి, అర్చకులు యడవల్లి సీతారామ ప్రసాద్, పవన్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.



అంకమ్మతల్లికి డప్పు వాయిద్యాలతో జల బిందెలను తీసుకువస్తున్న మహిళలు

నయనానందకరంగా..



నందిగామ రూరల్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న పర్వతవర్ధిని సంగమేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవారికి ఎదురుకోలోత్సవం నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన మంటపంపై వేద పండితుల మంత్రోచ్ఛరణలు, డప్పు, మంగళవాయిద్యాలు, భక్తుల శివనామస్మరణ నడుమ స్వామివారి కల్యాణాన్ని వేదోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా గోళ్లమూడి గ్రామంలోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో 108 కేజీల పలు రకాల పుష్పాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహమూర్తి, అర్చకులు శ్రీనివాస శర్మ, రాజేష్ శర్మ, గ్రామ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.